తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
20-05-2024
సోమవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 271 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889

# ధాన్యం కొనుగోళ్లు.. అకాల వర్షాలు...

- నేడు సచివాలయంలో కేబినెట్ సమావేశం
- వానాకాలం పంటల ప్రణాళికపై భేటీలో చర్చ
- రుణ మాఫీ, ఉమ్మడి రాజధానిపై మాట్లాడొద్దు
- ఎన్నికల్లో భాగమైన అధికారులు పాల్గొనొద్దు

2 లో





## సునాక్ దంపతుల ఆస్తి.. బ్రిటన్ రాజు కన్నా ఎక్కువ!

**జయభేరి, లండన్, మే 19:**

బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, ఆయన సతీమణి అక్షతా మూర్తిల సంపద గణనీయంగా పెరిగి నట్టు 'సండే టైమ్స్' తాజా నివేదిక పేర్కొన్నది. ఆర్థికంగా బ్రిటన్ పరిస్థితి ఏమంతా బాగోలేదు. ఆ దేశానికి చెందిన బడా కోటీశ్వరులు, ధనికులకు ఆ దేశ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేవు. అయినప్పటికీ గత ఏడాది కాలంలో రిషి సునాక్ దంపతుల సంపద సుమారుగా రూ.1291 కోట్లు పెరిగినట్టు నివేదిక ప్రస్తావించింది. అంతేకాదు వీరి ఆస్తులు బ్రిటన్ రాజు చార్లెస్3 కంటే ఎక్కువ ని తేలింది. సండే టైమ్స్ (రిచ్ లిస్ట్) విడుదల చేసిన జాబితా ప్రకారం, ప్రధాని రిషి సునాక్ దంపతుల సంపద రూ.5,598 కోట్ల (క్రితం ఏడాది) నుంచి రూ.6,889 కోట్లకు చేరుకుంది. బ్రిటన్ రాజు చార్లెస్3 సంపద రూ.6,329 కోట్లుగా ఉందని పే ర్కొన్నది. దేశంలో 2022లో బిలియనీర్లు సంఖ్య 177 కాగా, 2024 నాటికి వారి సంఖ్య 165కు తగ్గిందని తెలిపింది.



## యూపీ వాసి ఖాతాలో 9,900 కోట్లు జమ!

**జయభేరి, లక్నో, మే 19:**

యూపీలోని బాదోహి వాసి భానుప్రకాశ్ తన బ్యాంక్ ఖాతాను చూసి తన కళ్లను తానే నమ్మలేకపోయాడు. లక్ష, రెండు లక్షలు కాదు ఏకంగా 9,900 కోట్ల రూపాయలు తన ఖాతాలో జమవ్వడం చూసి షాక్ తిన్నాడు. వెంటనే తన ఖాతా ఉన్న బరోడా యూపీ బ్యాంక్‌కు వెళ్లి అధికారులకు ఈ విషయాన్ని తెలిపాడు. వారు కూడా అతని ఖాతాను పరిశీలించగా రూ.99, 99,94,95,999.99 నిల్వ ఉండటాన్ని గుర్తిం చారు. సాంకేతిక కారణాల వల్ల ఆ మొత్తం అతని ఖాతాలో పడినట్టు గుర్తించి ముందు జాగ్రత్తగా అతని ఖాతాను స్తంభింప చేసి తప్పును సవరించా రు. వాస్తవానికి భానుప్రకాశ్‌ది కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) లోన్ అకౌంట్ అని, కానీ కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా అతని ఖాతా నాన్ పెర్ఫా ర్మింగ్ అసెట్ (ఎన్‌పీఏ)గా మారిపోయిందని, దానిని సవరించామని బ్యాంక్ అధికారులు తెలిపారు. సకాలంలో దీని గురించి తమకు తెలి యజేసిన ఖాతాదారుడు భానుప్రకాశ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## పైసా ఖర్చు లేకుండా.. పత్రాలతోనే బురిడీ

2 లో



## లక్ష్మీనృసింహుని దర్శనానికి పోటెత్తిన జనం

- యాదాద్రిలో వాహనాల కిటకిట..
- 60వేల మందికి పైగా భక్తుల రాక.. స్వామి వారి ఖజానాకు రూ.85,33,262
- కొండపైన 2,000, కింద 1500కు పైగా వాహనాల పార్కింగ్..
- నేటి నుంచి జయంత్యుత్సవాలు

**జయభేరి, భువనగిరి అర్బన్, మే 19:**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం పరిసరాల్లో ఆదివారం ఎక్కడ చూసినా వాహనాలే కని పించాయి. వారాంతపు సెలవు రోజు, వేసవి సెలవులు కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు స్వామి వారి దర్శనానికి పోటెత్తారు. చాలా మంది భక్తులు తమ సొంతవాహనాల్లో తరలివచ్చారు. దీంతో యాదగిరిగుట్ట కొండ మీద, కొండ కింద పార్కింగ్ ప్రదేశాలు వాహనాలతో కిటకిటలాడాయి. సుమారు రెండు వేల వాహనాలు కొండ మీదకు వెళ్లాయి. కొండ మీదకు వెళ్లే వాహనం ఒక్కో దానికి రూ.500 టికెట్ తీసుకుంటారు. ఈ టికెట్ల రూపంలోనే రూ.10 లక్షల ఆదాయం సమకూరింది. ఇక, కొండ కింది పార్కింగ్ ప్రదేశంలో సుమారు 1500 వాహనాలు నిలిపి ఉంచారు. ఆదివారం

...మిగతాది 2 లో

## 30 వేల ఉద్యోగాలపై రేవంత్ సొంత డబ్బా



- చేసిన మంచిని చెప్పుకోలేకే ఓడాం
- కొన్ని వర్గాలకు దూరమయ్యాం

**జయభేరి, యాదాద్రి, మే 19:**

రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా వాటిని సరిగా ప్రచారం చేసుకోలేకనే ఎన్నికల్లో ఓడిపోయామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభు త్వ హయాంలో తెలంగాణ అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలి చిందని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి, ఆలేరు నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మా ట్లాడారు. కొన్ని వర్గాలకు దూరమయ్యామని కేటీఆర్ వ్యాఖ్యానిం చారు. తెలంగాణ సాధనలో బీఆర్ఎస్‌తో పాటు ఉద్యోగులూ భా గస్వాములయ్యారన్నారు. తెలంగాణ ఆవిర్భవించగానే 73శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామని, పీఆర్సీని ఏర్పాటు చేసి ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించామని తెలిపారు.
ఉద్యోగులకు ఇన్ని సంక్షేమ పథకాలు చేపట్టినా, ఒకటో తేదీన వేతనాలు రావడం లేదని దుష్ప్రచారం చేశారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట ఆలయాన్ని కేసీఆర్ అద్భుతంగా నిర్మించారని.. కానీ, ఆ గుడి పేరు చెప్పి ఏనాడూ ఓట్లు అడగలేద ని గుర్తుచేశారు. బీజేపీ నాయకులు దేవుడి పేరుతో ఓట్లు అడుగు తున్నారని విమర్శించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు మెడికల్ కళాశాలలు, యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్మించామని చెప్పారు. 30 వేల ఉద్యోగాలను కేసీఆర్ భర్తీ చేస్తే..

...మిగతాది 2 లో



## అవిశ్వాసం నెగ్గేందుకు కాంగ్రెస్ కుట్ర

- మేయర్ కిడ్నాప్‌కు యత్నం
- ఓఆర్ఆర్‌పై పీర్జాదిగూడ మేయర్, కార్పొరేటర్లపై గూండాలతో దాడి
- మాజీమంత్రి హరీశ్ మండిపాటు

**జయభేరి, మేడ్చల్, మే 19:**

రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ నాయకులు స్థానిక సంస్థలపై పట్టుకోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన మున్సి పాలిటీ, కార్పొరేషన్లను దక్కించుకునేందుకు దాడులు, కిడ్నాప్‌లకు సైతం దిగు తున్నారు. తాజాగా శనివారం సాయంత్రం హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డుపై వస్తున్న పీర్జాదిగూడ మేయర్, కార్పొరేటర్ల

...మిగతాది 2 లో

## మోదీలో భయం

- ఆపరేషన్ చీపురుకు బీజేపీ కుట్ర
- ఆప్ అగ్ర నేతల అరెస్టులు అందులో భాగమే
- భవిష్యత్తులో ఇంకా పెద్ద సవాళ్లు!
- బీజేపీ ఆఫీస్‌కు ఆప్ మార్చ్ అడ్డుకొన్న పోలీసులు



**జయభేరి, న్యూఢిల్లీ:**

కేంద్రంలోని అధికార బీజేపీ, ప్రధాని మోదీపై ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీకి ఆప్ ఒక సవాల్‌గా మారిందని, అందుకే తమ పార్టీని అణచివేసేందుకు, ఆప్ అగ్రనేతలను అరెస్టు చేయించి, జైలుకు పంపేందుకు 'ఆపరేషన్ ఝాడు' చేపట్టిందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో ఆప్ ఎదుగుద లను చూసి బీజేపీ భయపడుతున్నదని,

...మిగతాది 2 లో



## 49 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు

- నేడే ఐదో విడత.. యూపీలో కాంగ్రెస్‌కు అసలైన పరీక్ష
- బరిలో రాహుల్‌గాంధీ, స్మృతి ఇరానీ, రాజ్‌నాథ్, గోయల్ తదితర ప్రముఖులు
- ఒడిశాలో 35 అసెంబ్లీ సీట్లకూ పోలింగ్

**జయభేరి, న్యూఢిల్లీ, మే 19:**

సార్వత్రిక ఎన్నికల ఐదో దశ పోలింగ్ సోమవారం జరగనుంది. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 49 లోక్‌సభ నియోజకవర్గాలకు ఈ విడతలో ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ, పీయూష్ గోయల్,

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## 30 వేల ఉద్యోగాలపై..

వాటికి అపాయింట్‌మెంట్ లెటర్లు పంచుతూ సీఎం రేవంత్‌డ్డి సొంత డబ్బా కొట్టుకుంటున్నారని ధ్వజమెత్తారు. పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్ సర్కారు మాట తప్పిందన్నారు. తెలంగాణ ఆగమైందని, రుణమాఫీపై కాంగ్రెస్ పూటకో మాట మారుస్తోందని ఆరోపించారు. 'ప్రత్యర్థి పచ్చి బ్లాక్ మెయిలర్.. సొల్లు కబుర్లు చెప్పే మోసగాడు.. ఓటర్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి' అని కోరారు. ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుక రాకేష్‌రెడ్డిని గెలిపించాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడుసార్లు గెలించిందని, మరోసారి గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## లక్ష్మీనృసింహుని దర్శనానికి..

యాదగిరిగుట్టలో పలుమార్లు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆలయ అధికారుల లెక్కల ప్రకారం 60వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ధర్మ దర్శనానికి మూడు గంటలు, వీఐపీ దర్శనానికి రెండు గంటలు పట్టింది. క్యూలైన్లలో సరైన సదుపాయాలు లేక భక్తులు అవస్థలు పడ్డారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం బ్రేక్(4గంటల నుంచి ఐదు గంటల వరకు) దర్శనాన్ని రద్దు చేశారు. సాయంత్రం 15 నిమిషాల పాటు కురిసిన వర్షం వల్ల భక్తులు మరింత ఇబ్బంది పడ్డారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.85,33,262 నిత్య ఆదాయంగా సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి ఆలయంలో ఆదివారం స్వాతి నక్షత్ర పూజలు వైభవంగా జరిగాయి. స్వాతి నక్షత్రం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు గిరిప్రదక్షిణ చేశారు. ఇక, సోమవారం నుంచి లక్ష్మీనృసింహస్వామివారి జయంత్యుత్సవాలు ప్రారంభంకానున్నాయి. యాదగిరిగుట్ట, భువనగిరి స్వర్ణ దేవాలయాల సందర్శనకు ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో హైదరాబాద్‌బీబీనగర్ జాతీయ రహదారి 163 రద్దీగా మారింది. ముఖ్యంగా యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ వైపు ఆదివారం రాత్రి కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ జామ్‌లో వాహనదారులు గంటసేపు పైగా అవస్థ పడ్డారు.

## మోదీలో భయం

ఈ నేపథ్యంలో తమ పార్టీని నిర్వీర్యం చేసేందుకు పార్టీ నేతలను అరెస్టులు చేయిస్తున్నదని అన్నారు. తన వ్యక్తిగత సహాయకుడు బిభవ్ అరెస్టుకు నిరసనగా ఆదివారం ఆయన ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయానికి మార్చ్ చేపట్టారు. అనుమతి లేదంటూ మార్చ్‌ను పోలీసులు మధ్యలోనే అడ్డుకొన్నారు. పలువురు ఆప్ నేతలు, కార్యకర్తలను అరెస్టు చేశారు. దీంతో కేజ్రీవాల్ అక్కడ పార్టీ నాయకులతో కలిసి బైఠాయించి ఆందోళన చేశారు. అనంతరం తిరిగి ఆప్ కార్యాలయానికి చేరుకొన్నారు. మార్చ్ ప్రారంభానికి ముందు కేజ్రీవాల్ పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. భవిష్యత్తుల్లో ఇంకా పెద్ద సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉన్నదని, వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. "వేగంగా ఎదుగుతున్న ఆప్‌ను చూసి ప్రధాని మోదీ ఆందోళన చెందుతున్నారు. అందుకే మన పార్టీని అణచివేసేందుకు 'ఆపరేషన్ ఝాడు' ప్రారంభించారు. రాబోవు రోజుల్లో మన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడంతోపాటు మన పార్టీ కార్యాలయాన్ని లాగేసుకొని రోడ్డున పడేసే ప్రయత్నం చేస్తారు' అని పేర్కొన్నారు. ఢిల్లీ మద్యం పాలసీలో రూ.100 కోట్ల కుంభకోణం జరిగిందని బీజేపీ నేతలు చెబుతున్నారని, అయితే దర్యాప్తు సంస్థల సోదాల్లో 100 రూపాయలు కూడా గుర్తించలేకపోయారని అన్నారు. మరోవైపు ఆప్ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్‌పై దాడికేసులో ఢిల్లీ పోలీసులు ఆదివారం సీఎం కేజ్రీవాల్ ఇంటికి వెళ్లారు. సీసీటీవీ డిజిటల్ వీడియో రికార్డర్‌తోపాటు పలు ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు., మలివాల్‌పై దాడి కేసులో బిభవ్ కుమార్‌ను ఢిల్లీలోని స్థానిక కోర్టు ఐదు రోజుల కస్టడీకి అప్పగించింది. ఆప్ చేపట్టిన ఆందోళనలను ఉద్దేశించి స్వాతి మలివాల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నిర్భయకు న్యాయం చేయాలని ఒకప్పుడు పోరాటం చేసిన ఆప్ నేతలు.. ఇప్పుడు ఒక నిందితుడికి మద్దతుగా ఆందోళనలు చేస్తున్నారని అన్నారు.

## 49 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు

సాధ్వి నిరంజన్ జ్యోతి, జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సహా పలువురు కీలక నాయకులు ఈ విడతలో పోటీ పడుతున్నారు. మొత్తం 94,732 పోలింగ్ స్టేషన్‌లలో 8.95 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ 49 స్థానాల్లో 40 స్థానాలు ఎన్డీయే సిట్టింగ్ స్థానాలు కావడంతో బీజేపీకి ఈ దశ చాలా కీలకంగా మారింది. ఉత్తరప్రదేశ్‌లోని 14 స్థానాలకు సోమవారం పోలింగ్ జరుగుతుంది. ఇందులో రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న రాయ్‌బరేలీ, స్మృతి ఇరానీ పోటీ చేస్తున్న అమేథీ, రాజ్‌నాథ్ సింగ్ పోటీ చేస్తున్న లక్నో స్థానాలు ఉన్నాయి. కేంద్ర మంత్రులు కౌశల్ కిశోర్(మోహన్‌లాల్ గంజ్), సాధ్వి నిరంజన్ జ్యోతి(ఫతేపూర్), భానుప్రతాప్ సింగ్ వర్మ(జలౌన్) కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కాంగ్రెస్ యూపీలో ఇప్పటికీ బలంగా కనిపిస్తున్న రాయ్‌బరేలీ, అమేథీ స్థానాల్లో ఫలితాలపై అందరి ఆసక్తి నెలకొంది.
మహారాష్ట్రలోని 13 స్థానాలకు ఐదో దశలో పోలింగ్ జరగనుంది. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ పరిధిలోని పది స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్(ముంబై ఉత్తర), భారతి పవార్(దిండోరి), కపిల్ పాటిల్(భీవండి) బరిలో ఉన్నారు. మహారాష్ట్ర సీఎం షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే మరోసారి కల్యాణ్ నుంచి పోటీచేస్తున్నారు. శివసేన, ఎన్సీపీలో చీలక నేపథ్యంలో ఈ ఎన్నికలు కీలకంగా మారాయి. ఎన్డీయేకు గట్టి పోటీ ఎదురవుతున్న బీహార్‌లోని ముజఫర్‌పూర్, మధుబని, సీతామర్హి, సరన్, హాజీపూర్ స్థానాలకు ఈ దశలో పోలింగ్ జరగనుంది. హాజీపూర్ నుంచి లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్, సరన్ నుంచి ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ కూతురు రోహిణి ఆచార్య, మాజీ కేంద్రమంత్రి రాజీవ్ ప్రతాప్ రూడి బరిలో ఉన్నారు. మరోవైపు జార్ఖండ్‌లోని గోండే శాసనసభ సీటుకు ఉప ఎన్నికకు సోమవారం పోలింగ్ జరుగనుంది. గోండే నుంచి మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ భార్య కల్పనా సొరేన్ పోటీ చేస్తున్నారు. ఒడిశాలోని అస్క, కంధమల్, బార్గర్హ్, బొలంగిర్, సుందర్‌గర్హ్ లోక్‌సభ స్థానాలకు 35 అసెంబ్లీ స్థానాలకు సోమవారం పోలింగ్ జరగనుంది. సీఎం నవీన్ పట్నాయక్ రెండు చోట్ల పోటీ చేస్తున్నారు. తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య తీవ్ర పోటీ ఉన్న పశ్చిమ బెంగాల్ దక్షిణ ప్రాంతంలోని హౌరా, హుగ్లి, సెరంపోర్, బర్రాక్‌పోర్, ఉలుబేరియా, ఆరాంబాగ్, బన్‌గాం స్థానాలకు పోలింగ్ జరగనుంది. జమ్ము కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత మొదటిసారిగా కీలక ఎన్నికల పోరు జరగనుంది. బారాముల్లా నియోజకవర్గం నుంచి మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ నుంచి బరిలో ఉన్నారు. ఆయనకు పీపుల్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు సజ్జద్ గట్టి పోటీ ఇస్తున్నారు.

## అంత్యక్రియల ఖర్చు 30 లక్షలు!

- భరించలేక మృతదేహాల్ని వదిలేస్తున్న కుటుంబసభ్యులు
- కెనడాలో దయనీయ పరిస్థితులు
- పెరుగుతున్న అనాథ మృతదేహాలు

**జయభేరి, ఒట్టావా:**

తమ వారి అంత్యక్రియలను గౌరవంగా జరిపించి తుది వీడ్కోలు పలకాలని ప్రతి కుటుంబం అనుకుంటుంది. కానీ, కెనడాలో మాత్రం కొన్ని కుటుంబాలు అయిన వారి మృతదేహాలను అనాథ శవాలుగా వదిలేసే దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. భారీగా పెరిగిన అంత్యక్రియల ఖర్చులను భరించలేక మృతులు తమ వారేనని తెలిసినా మృతదేహాలను తీసుకోవడం లేదు. దీంతో దేశంలోని అన్ని ప్రావిన్సుల్లో అనాథ మృతదేహాల సంఖ్య పెరుగుతున్నది. అంటారియో ప్రావిన్సులో 2013లో 242 అనాథ మృతదేహాలను గుర్తించగా, 2023లో 1,183 గుర్తించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మృతుల వద్ద ఉన్న ఆధారాలతో కుటుంబసభ్యులను గుర్తించినా.. అంత్యక్రియల ఖర్చులు భరించలేక 2023లో 24 శాతం మృతదేహాలను తీసుకెళ్లలేదు. శ్మశాన వాటికల్లో మృతదేహాల ఖననానికి భారీగా డబ్బు చెల్లించాల్సి వస్తున్నది. అంత్యక్రియల ప్రక్రియకు కూడా ఖర్చులు పెరిగిపోయాయి. ఒక్కో ప్రాంతంలో ఈ ఖర్చు ఒక్కోలా ఉంది. గ్రేటర్ టొరంటో నగరంలో అయితే అంత్యక్రియల ఖర్చు దాదాపుగా 34 వేల డాలర్లు అవుతున్నది. అంటే, మన కరెన్సీలో అక్షరాల రూ.27 లక్షలు. దీనికి అదనంగా వ్యాన్, ఇతర ఖర్చులు కలిపి మొత్తం రూ.30 లక్షలు అవుతున్నది. ఈ ఖర్చును భరించలేని కుటుంబాలు తమ వారి మృతదేహాలను బయటే వదిలేస్తున్నారు.

# ధాన్యం కొనుగోళ్లు.. అకాల వర్షాలు...

**జయభేరి, హైదరాబాద్, మే 19:**

ఒక రోజంతా కొనసాగిన ఉత్కంఠకు తెరదించుతూ.. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అనుమతిచ్చింది. అయితే, కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో జూన్ 4లోపు చేయాల్సిన అత్యవసరమైన అంశాలనే చర్చించాలని షరతు విధించింది. ముఖ్యంగా రైతు రుణ మాఫీ, హైదరాబాద్ ఉమ్మడి రాజధాని వంటి అంశాలను భేటీలో చేపట్టకూడదని పేర్కొంది. ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన అధికారులు సమావేశంలో పాల్గొనకూడని స్పష్టం చేసింది.
ఆదివారం ఈసీ నుంచి ఈ మేరకు సమాచారం రావడంతో.. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు క్యాబినెట్ భేటీ ఉంటుందని సీఎం శాంతకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశంపై మంత్రులందరికీ సమాచారం చేరవేశారు. ఆయా శాఖల ఉన్నతాధికారులు కూడా దీనికి హాజరుకానున్నారు. కాగా, రాష్ట్రంలో ఈ నెల 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియడంతో.. శనివారం మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. కోడ్ ఉన్నందున అనుమతి కావాలంటూ సీఈసీకి లేఖ రాసింది. వారినుంచి సమాధానం వస్తుందని శనివారం మధ్యాహ్నం నుంచి సీఎంతో పాటు మంత్రులు సచివాలయంలో ఎదురుచూశారు. అనుమతి రాకపోవడంతో రాత్రి 7 గంటల తర్వాత వెనుదిరిగారు. సోమవారం వరకు చూసి, స్పందన రాకుంటే మంత్రివర్గమే ఢిల్లీకి వెళ్లి ఎన్నికల సంఘాన్ని కలుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అయితే, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ సీఈసీ అధికారులతో చర్చించడం.. షరతులతో కూడిన అనుమతి రావడంతో సస్పెన్స్ వీడింది.



మరోవైపు ఈసీ షరతులను దృష్టిలో ఉంచుకుని.. ధాన్యం కొనుగోళ్లు, అకాల వర్షాలు, వానాకాలం పంటల ప్రణాళిక, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాల వంటివాటిపై మంత్రివర్గం చర్చించనున్నట్లు సమాచారం. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి రైతు రుణ మాఫీపై చాలా పట్టుదలగా ఉన్నారు. ఆగస్టు 15లోగా మాఫీ చేసి తీరుతామని పదేపదే చెప్పారు. ముందుగా అనుకున్న ప్రకారం.. క్యాబినెట్‌లో ఇదే కీలక అంశం అయ్యేది. కానీ, సీఈసీ షరతుతో చర్చకు అవకాశం లేదు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడి, కోడ్ తొలగిపోయే నేపథ్యంలో జూన్ 4 తర్వాతనే చర్చించే వీలుంది. కాగా, రాజకీయంగా.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు అవకాశాలపై మంత్రివర్గంలో సమీక్ష జరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

# పైసా ఖర్చు లేకుండా.. పత్రాలతోనే బురిడీ




- స్వీపర్‌కు 2 లక్షల జీతం
- పనిచేయకున్నా.. సంతకం పెడితే చాలు
- రూ.46 కోట్ల జీఎస్టీ కుంభకోణంలో వింత
- ఈ-బైక్ పేరుతో ఏడు బోగస్ కంపెనీలు
- డైరెక్టర్లంతా ఈ కోవకు చెందినవారే
- దర్యాప్తులో నిగ్గుతేల్చిన సీసీఎస్ పోలీసులు

**జయభేరి, హైదరాబాద్ సిటీ, మే 19:**

అతనో స్వీపర్.. ఆఫీసును శుభ్రపరచడమే పని..! కానీ పనిచేయకున్నా.. అడిగినప్పుడు సంతకాలు మాత్రం పెట్టి, నెలకు తీసుకునే జీతం రూ.2 లక్షలు..! కారణం.. జీఎస్టీ రీఫండ్ కోసం అతణ్ని డైరెక్టర్‌గా చూపించడమే..! అతనొక్కడే కాదు.. ఆఫీస్‌బాయ్, హౌస్‌కీపింగ్‌లో పనిచేసే ఒకరిద్దరిని డైరెక్టర్లుగా పెట్టడం గమనార్హం..! ఈ నెల 4న వెలుగులోకి వచ్చిన రూ.46 కోట్ల జీఎస్టీ రీఫండ్ కుంభకోణంలో సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్న కొద్దీ ఇలాంటి విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కుంభకోణం వెనక ఢిల్లీకి చెందిన ట్యాక్స్ కన్సల్టెంట్ చిరాగ్ శర్మ కీలక పాత్ర పోషించినట్లు సీసీఎస్ పోలీసులు నిగ్గుతేల్చారు. ఎలక్ట్రిక్ బైక్‌ల తయారీ కంపెనీలకు ప్రభుత్వం జీఎస్టీలో 13ు రాయితీ ఇస్తుండడంతో.. తాను కన్సల్టెంట్‌గా సేవలందించిన కొందరు వ్యాపారులతో కుమ్మక్కై ఏడు బోగస్ కంపెనీలను సృష్టించాడు.
ఢిల్లీ నుంచి ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి అవసరమైన ముడిసరుకులు కొనుగోలు చేసినట్లు ఇన్వాయిస్‌లు, అక్కడి నుంచి రవాణా చేసినట్లుగా ఈవేబిల్ 1, 2లను సృష్టించి, జీఎస్టీ అధికారులను మేనేజ్ చేసుకుని, రీఫండ్ పేరుతో రూ.46 కోట్లను కొల్లగొట్టినట్లు సాంకేతిక ఆధారాలను సేకరించారు. జీఎస్టీ అధికారుల అండదండలు ఉండడంతో.. ఒక్క పైసా కూడా ఖర్చు చేయకుండా.. రూ.46 కోట్లను రీఫండ్‌గా పొందాడు. తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా జీఎస్టీ అధికారులు కొందరు కమీషన్ల కక్కుర్తితో చిరాగ్ శర్మకు సహకరించినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఇందుకోసం జీఎస్టీ అధికారులు రూ.లక్షల్లో లంచం తీసుకున్నట్లు అనుమానిస్తున్నారు. ఎక్కడా క్షేత్రస్థాయిలో కంపెనీలను, తయారీ యూనిట్లను తనిఖీ చేయకుండా.. ఆన్‌లైన్‌లోనే పని చక్కబెట్టిన అధికారులు కూడా అందినంతా దండుకున్నారు.
చిరాగ్ శర్మ కీలక సూత్రధారిగా ఉన్న జీఎస్టీ రీఫండ్ కుంభకోణంలో మరో ఏడుగురు నిందితులున్నారు. వారిలో వేమారెడ్డి రాజారమేశ్‌రెడ్డి(వినర్త్ ఆటోమొబైల్స్) రూ.23.79కోట్లు, నీరజ్ శుక్లా(యూకో ఎలక్ట్రిక్ బైక్) రూ.8.47 కోట్లు, ఇందర్‌కుమార్(క్రాక్స్ ఎలక్ట్రిక్ బైక్) రూ.63.06లక్షలు, గిరిధర్‌రెడ్డి, వినీల్ చౌదరి (గ్రోమోర్ ఎలక్ట్రిక్ వెహికిల్స్) రూ.2.87 కోట్లు, వీరిద్దరూ అపెక్స్ ఎలక్ట్రిక్ బైక్ పేరిట రూ.3.09 కోట్లు, సుప్రియాపాండే(సుప్రియా ఎలక్ట్రిక్స్) రూ.2.02 కోట్లు, గౌరవ్(మాగ్నమ్ ఎలక్ట్రిక్ బైక్) రూ.4.96 కోట్లు కొల్లగొట్టినట్లు సీసీఎస్ పోలీసులు నిర్ధారించారు. పోలీసులు వీరిని ఇప్పటికే అరెస్టు చేశారు.

# అవిశ్వాసం నెగ్గేందుకు కాంగ్రెస్ కుట్ర

మొదటిపేజీ తరువాయి




కారును కాంగ్రెస్ సేనలు వెంబడించాయి. దాడికి, కిడ్నాప్‌నకు యత్నించి గంటపాటు నరకం చూపించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని ఏడు మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు 100 శాతం బీఆర్ఎస్‌కు చెందినవారే అధికారంలో ఉన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నది. ఇప్పటికే నాగారం, తూంకుంట మున్సిపాలిటీలు, జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో అవిశ్వాస సమావేశం నిర్వహిస్తే రెండు చోట్లా కాంగ్రెస్ ఘోరంగా విఫలమైంది. ఒక్క జవహర్‌నగర్‌లోనే నెగ్గింది. తాజాగా బోడుప్పల్ మేయర్‌పై అవిశ్వాసానికి కలెక్టర్‌కు నోటీసిచ్చారు. పీర్జాదిగూడలో బీఆర్ఎస్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిని కుర్చీ దింపేందుకు కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తున్న ది. ఓ దశలో ఆయన హత్యకు కూడా భారీ గా స్కెచ్ వేసింది. వీటన్నింటిని ప్రజాస్వా మ్య పద్ధతిలో తిప్పి కొట్టేందుకు నిర్ణయించుకున్న మేయర్ వెంకట్‌రెడ్డి ఈ నెల 6న తానే అవిశ్వాసం పెట్టేందుకు కలెక్టర్‌ను కలిశారు. వచ్చే నెల 5న అవిశ్వాస సమావేశం పెట్టాలని కలెక్టర్ శనివారం నిర్ణయించారు. ఎలాగైనా అవిశ్వాసం పెట్టకూడదని కలెక్టర్‌పై కాంగ్రెస్ వర్గీయులు ఒత్తిడి పెంచారు. సీఎం క్యాంపు కార్యాలయం కనుసైగల్లో ఇదంతా జరిగినట్టు సమాచారం. మేయర్, కార్పొరేటర్లు క్యాంపునకు వెళ్లేందుకు సూర్యాపేట నుంచి వస్తూ హయత్‌నగర్ వద్ద రింగురోడ్డు ఎక్కారు. అక్కడ 50 మంది వరకు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అనుచరులు, గూండాలు 20 కార్లలో వేచి ఉన్నారు. మేయర్, కార్పొరేట ర్ల కారు రింగు రోడ్డు ఎక్కగానే వారిని ఆ 20 కార్లు వెంబడించాయి. వారి కార్లను ఢీ కొట్టేందుకు ప్రయత్నించారు. కార్లను అడ్డు గా తీసుకొచ్చి, దాడి, కిడ్నాప్‌కు పాల్పడేలా భయాందోళనకు గురిచేశారు. మేయర్, కార్పొరేటర్లు తమ వాహనాన్ని తాము వెళ్లాల్సిన చోటుకుకాకుండా రింగు రోడ్డు మీదుగా ప్రయాణించారు. వెంట వస్తున్న వాహన శ్రేణితో భయభ్రాంతులకు గురవుతూ గంటపాటు బిక్కచచ్చిపోయారు. మీడి యా, పోలీసులు, అనుచరులకు సమాచా రం ఇచ్చారు. ఘట్‌కేసర్ వద్ద రింగు రోడ్డు దిగుతున్నామని, అక్కడికి రావాలని కోరా రు. పోలీసుల నుంచి స్పందన రాలేదని తెలిసింది. రింగురోడ్డుపై ఒక రౌండ్ పూర్తిగా ప్రయాణించి, తిరిగి ఘట్‌కేసర్ వద్ద రింగు రోడ్డు దిగి, పీర్జాదిగూడకు చేరుకున్నారు. మీడియాకు సమాచారం వెళ్లిందని తెలియడంతోనే సుధీర్‌రెడ్డి అనుచరులు వెనక్కి తగ్గినట్టు సమాచారం.

**కాంగ్రెస్ గూండాయిజం**

మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ గూండాయిజానికి పాల్పడుతున్నదని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఆగ్రహ వ్యక్తంచేశారు. పీర్జాదిగూడకు చేరుకున్న అనంతరం విలేకరులతో ఆయన మా ట్లాడుతూ.. మేయర్ పీఠం కావాలంటే కా ర్పొరేటర్ల మద్దతు కావాలి కానీ, గూండాలు అవసరం లేదని చెప్పారు. రింగురోడ్డుపై తాము తీవ్ర భయాందోళనకు గురయ్యామని చెప్పారు. వారు తమ వాహనాలను ఛేజ్ చేస్తూ ఢీకొట్టే విధంగా, దాడిచేసి, కిడ్నాప్ చేసేలా భయభ్రాంతులకు గురిచేశారని విమర్శించారు. సుధీర్‌రెడ్డికి, ప్రభుత్వానికి ఇది మంచిది కాదని హితవుపలికారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ అహర్నిశలు శ్ర మించి, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఉ న్నతంగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు.

**కాంగ్రెస్ దాడి గర్హనీయం: హరీశ్‌రావు**

పీర్జాదిగూడ మేయర్, కార్పొరేటర్లను కాంగ్రెస్ నేతలు భయభ్రాంతులకు గురి చేయడాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా తీవ్రం గా ఖండించారు. 'పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎలాగైనా సరే అవిశ్వాస తీర్మానం నెగ్గాలని కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఔటర్ రింగురోడ్డుపై 20 కార్లతో వారిని వెంబడిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు బీఆర్ఎస్ కార్పొరేటర్లపై జరుగుతున్న దాడిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది. డీజీపీ, సీపీలు వెంటనే బీఆర్ఎస్ కార్పొరేటర్లకు భద్రత కల్పించాలి. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులపై ఇలా దాడులకు పాల్పడటం గర్హనీయం. ఇలాంటి దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకోం' అని హెచ్చరించారు.



## వర్షం నీళ్లు నిలవడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

జయభేరి, మేడిపల్లి :

ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి పర్యటన.. కమలానగర్ కాలనీలో నివాసముంటున్న స్థానిక ప్రజలు వర్షం నీళ్లు నిలవడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో, అదేవిధంగా భగత్ సింగ్ నగర్ కాలనీలో అక్కడ డ్రైనేజ్ ,సమస్య వాటర్ సమస్యలను అధ్యక్షులు తుంగతుర్తి రవి దృష్టికి తీసుకురావడంతో వారు తక్షణమే స్పందించి కమిషనర్, మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను తక్షణమే పరిష్కరించవలసిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్, 1వ వార్డ్ ఇంచార్జ్ మొహమ్మద్ మజర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బర్ల నాగరాజు గారు, మొగులయ్య, మొహమ్మద్, వసీం, ప్రశాంత్, రామ్ చందర్ గౌడ్, నరేష్, శీను, స్వామి, తిరుమల అపార్ట్మెంట్ ఓనర్స్, కాలనీ వాసులు గట్టయ్య, ఇస్తారి, సోమరాజు, నాగరాజు చంద్రయ్య, కమల, లక్ష్మి, అండాలు, బుచ్చమ్మ, రజిత, వాణి, యాదమ్మ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాలకు గురవుతున్న పార్కు స్థలాలు

- కబ్జాకోరులతో కుమ్మక్కైన అధికారులు
- కబ్జాలపై ఉన్నత అధికారులు వెంటనే స్పందించాలి



జయభేరి, ఘట్కేసర్ :

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండల్ ఔషపూర్ గ్రామంలో పార్క్ స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని విషయం తెలుసుకున్న బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాష్ట్ర ఎంపీపీల పోరం అధ్యక్షులు ఘట్కేసర్ మండల్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి పార్క్ స్థలానికి చేరుకొని పరిశీలించి పనులను నిలిపివేయించటం జరిగింది. దీనిపై సర్పంచ్ ఏనుగు కావేరి మచ్చేందర్ రెడ్డి ఇదివరకే కలెక్టరు, HMDA అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్య తీసుకోకపోవడం వలన కింద స్థాయి అధికారులు పెద్ద ఎత్తున లంచాలకు మరిగి కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను కబ్జాకోరులకు అప్పనంగా అప్పచెబుతూ వారికి సహకరిస్తున్నారు. కబ్జాకోరుల నుండి స్థలాన్ని కాపాడే కార్యక్రమంలో BJP గ్రామశాఖ అధ్యక్షులు మచ్చ సందీప్, వార్డు సభ్యులు మల్లేశ్, నాయకులు ఏనుగు మచ్చేందర్ రెడ్డి, చిలకమారి మహేశ్, గడీల బాబు, కాసుల వెంకటేష్, గ్రామ యువత పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి కల్పిస్తాయి

- దమ్మాయిగూడ ఆర్కే కాలనీలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్



జయభేరి, దమ్మాయిగూడ :

విజేతలకు బహుమతులు అందజేసిన టిపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్. దమ్మాయిగూడ మున్సిపల్ మహిళ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్వేత రాజు ఆధ్వర్యంలో దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ గారు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ గారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ,దేహదారుడ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

## ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్న సమక్షంలో పదవి ప్రమాణం



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్న సమక్షంలో పదవి ప్రమాణం చేసిన సోనియాగాంధీ నగర్ ఫేస్ 1 వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శ్యామల బిక్షపతి, పలుగుల గోపాల్, తాండ్ర యాదగిరి, మైలారం బాల నరసింహ, రాజు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి,మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి ధన్పాల్ రెడ్డి, పావని మణిపాల్ రెడ్డి, చర్లపల్లి కాలనీల సమాఖ్య CCS ప్రతినిధులు ఎంపల్లి పద్మా రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, వంశరాజ్ మల్లేష్, సీతారాం రెడ్డి, రాములు యాదవ్, పలుగుల మహేందర్, బాల నరసింహ గౌడ్, సిద్దు గౌడ్, షాబాద్ దామోదర్ రెడ్డి, పలుగుల రమణ, తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ లక్ష్మి నృసింహ కళ్యాణ మహోత్సవం

జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీ గార్డెన్ లో విష్ణు శౌర్య ఆధ్వర్యంలో వేద పండితుల చే శ్రీ లక్ష్మీ నరసింహ కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.ఈ కళ్యాణ మహోత్సవం లో అధిక సంఖ్యలో దంపతులు సంప్రదయ పద్ధతిలో పూజలో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అథితులుగా మాజీ మంత్రి ,మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎఫ్డిసి చైర్మన్ ప్రతాప్ రెడ్డి లు హాజరయ్యారు.అథితులను విష్ణు శౌర్య శాలువలతో సన్మానించారు. శ్రీ విపంచి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక మరియు ధార్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు.ఈ సందర్భంగా విష్ణు శౌర్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే కల్యాణ మహోత్సవానికి విచేస్తున్న భక్తులందరికి ధన్యవాదాలు తెలుపుతూ స్వామి వారి ఆశీస్సులు ఉండాలన్నారు.

## నూనె కృష్ణయ్య మృతి బాధాకరం

- కృష్ణయ్య కుటుంబానికి రూ.15వేయిల ఆర్థిక సహాయం అందించిన తూర్పుపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ



జయభేరి, దేవరకొండ :

తూర్పుపల్లి గ్రామానికీ చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు నూనె కృష్ణయ్య మృతి బాధాకరం మాజీ PACS చైర్మన్ నాగవరం ప్రభాకర్ రావు, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్ లు అన్నారు. ఆదివారం తూర్పుపల్లి గ్రామంలో కృష్ణయ్య మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు పరామర్శించి కృష్ణయ్య కుటుంబానికి తూర్పుపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ రూ.15వేయిల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కృష్ణయ్య మృతి పార్టీకి లోటు అని వారు అన్నారు.కృష్ణయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎంపిటిసి జెల్ల రజిత రేణు గౌడ్, జనార్దన్ రావు, నూతనగంటి గోపాల్, బొడ్డుపల్లి అంతయ్య, రామేశ్వరరావు,యూత్ అంజి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## వైకుంఠధామానికి మోక్షమెప్పుడో

- శంకుస్థాపనకు సంవత్సరాలు పూర్తి
- ముందుకు సాగని అభివృద్ధి పనులు

జయభేరి, మేడ్చల్ :



అంగట్లో అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఉంది గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని సూతరిగుడా గ్రామ పరిస్థితి. స్మశానవాటిక నిర్మాణం కోసం దాదాపు రూ.20 లక్షలు కేటాయించి శంకుస్థాపన చేసి సంవత్సరాలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే సూతరిగుడా గ్రామంలో ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలు చేయడానికి సరైన స్మశానవాటిక లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో గ్రామ చెరువుకు అనుకోని ఉన్న స్థలంలో దహన సంస్కారాలు నిర్వహించేదని కానీ వర్షాకాలంలో కురిసిన వర్షాలకు చెరువు పూర్తిగా నిండిపోయి ఎవరైనా మరణించినప్పుడు అంత్యక్రియలు చేయడానికి ఇబ్బందులు ఏర్పడి రోడ్లపైనే దహనం చేయడం జరిగిందన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు మొరపెట్టగా సూతరిగుడా గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 25 లో దాదాపు 24 గుంటల స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్మశానవాటిక కోసం కేటాయించారు. వైకుంఠధమాం అభివృద్ధి కోసం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నుండి సుమారు రూ.20 లక్షల నిధులతో వైకుంఠధామనికి భూమి పూజ చేశారు. కానీ కొబ్బరి కాయ కొట్టి సంవత్సరాలు గడుస్తున్నా అభివృద్ధి పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం మొదలు కానుందని అధికారులు స్పందించి గ్రామంలో ఎవరైనా మరణించినప్పుడు అంత్యక్రియలకు ఇబ్బందులు కాకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకొని శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ శ్రీనివాస్, వెంకటేష్, చేతన్, మహేందర్, సిహెచ్ శ్రీనివాస్, రాజు, శేఖర్, నాగరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**పంట పొలాలను కాపాడండి: రైతులు**

సూతరిగుడా గ్రామ చెరువులోని నీరు బయటకు వెళ్ళడానికి సరైన నాలా వ్యవస్థ లేకపోవడంతో చెరువులోని డ్రైనేజీ నీరు పంట పొలాలలోకి చేరి కష్టపడి పండించిన పంట నాశనం అవుతుందని గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. స్మశానవాటిక ఏర్పాటు కోసం అధికారులు కేటాయించిన స్థలం పంట పొలాలకు అనుకుని ఉందని ఆ స్థలంలోని కొంత భాగాన్ని చెరువు నీరు బయటకు వెళ్లేందుకు నాలా నిర్మాణం కోసం కేటాయించి తమ పంట నష్టం కాకుండా చూడాలని కోరుతున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా చెరువు నీరు తమ పొలాలలో ఉండటం వల్ల పంట సాగుకు దూరంగా ఉన్నామని రైతులకు ప్రధాన సమస్యగా ఉన్న చెరువు నీరు బయటకు వెళ్ళడానికి అధికారులు మార్గం చూపాలని రైతులు కోరుతున్నారు. సర్వే నెంబర్ 25 లో స్మశానవాటిక కోసం కేటాయించిన స్థలాన్ని వైకుంఠధామనికి కాకుండా వేరే ఇతర అభివృద్ధి పనులకు ఉపయోగించుకోవాలని కోరుతున్నారు.



## అన్నారం, సుందిళ్ల పై ఫోకస్

- ఈ బ్యారేజీల నుంచి ఈ సీజన్‌లో
- నీరు పంపింగ్ చేసేందుకు నిర్ణయం!
- మరమ్మతు పనులు వేగవంతం

జయభేరి, హైదరాబాద్, మే 19:



కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పూర్తిస్థాయిలో కాపాడుకొని, ఈ ఏడాది వీటిలో నీటిని నిల్వ చేసి, పంపింగ్ చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. అన్నారం బ్యారేజీని పుణేలోని కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్)తో, సుందిళ్లను జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ)తో పరీక్షలు చేయించడంతో పాటు ఆ బ్యారేజీలు కట్టిన నిర్మాణ సంస్థలతో మరమ్మతులు చేయించనున్నారు. బ్యారేజీ ఎగువ భాగం (అప్‌స్ట్రీమ్)తో పాటు దిగువ భాగం (డౌన్‌స్ట్రీమ్)లో ఉన్న సిమెంట్ కాంక్రీట్ (సీసీ) బ్లాకులు, అప్రాన్లతో పాటు రాఫ్ట్ (పునాది) కింది భాగంలో ఏర్పడిన రంధ్రాలను సిమెంట్,కాంక్రీట్ మిశ్రమంతో నింపనున్నారు. ఈ ప్రక్రియ చేపడితే మరమ్మతులు తేలిక అవుతాయి. కాళేశ్వరంలో 3 బ్యారేజీలు ఉండగా అందులో సుందిళ్ల ఒక్కటే తక్కువ సమస్యలను కలిగి ఉంది. మరో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ గత ఏడాది అక్టోబరు 21న కుంగిపోయిన విషయం విదితమే. ఈ ఏడాది వరదలకు మరింత దెబ్బతినకుండా సర్కారు చర్యలకు ఉపక్రమించింది. బ్యారేజీ గేట్లన్నీ ఎత్తడానికి చర్యలు తీసుకోనున్నారు. ఏడో బ్లాకుకు 12 గేట్లు ఉండగా అందులో ఒక గేటును ఇప్పటిదాకా లేపారు. ఇతర గేట్లను క్రమంగా ఎత్తనున్నారు. ఇక తీవ్రంగా దెబ్బతిన్న 2 పిల్లర్లకు చెందిన గేట్లను క్రేన్ల సహాయంతో లేపాల్సి ఉంటుంది. వరదల అనంతరం కాఫర్ డ్యామ్ నిర్మించి, కొత్త బ్లాకు లేదా దెబ్బతిన్న పిల్లర్ల స్థానంలో కొత్త పిల్లర్లు కట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ సీజన్‌లో మేడిగడ్డ బ్యారేజీ ఉపయోగంలోకి రాదని అభిప్రాయానికి సర్కారు వచ్చింది. దాంతో అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటిని నిల్వ చేసుకొని, ఆ నీళ్లను ప్రాజెక్టులోని ఇతర రిజర్వాయర్లలోకి పంపింగ్ చేయనున్నారు. ఇందులో భాగంగా పంప్‌హౌస్‌లను సీఎం రేవంత్ రెడ్డితో పాటు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి త్వరలో సందర్శించనున్నారు. ప్రస్తుతం కన్నెపల్లి(మేడిగడ్డ), సిరిపురం (అన్నారం) పంప్‌హౌస్‌లు సేఫ్ జోన్‌లో లేవు. పూర్తి రిజర్వాయర్ లెవల్ కన్నా కింద ఉన్నాయి. దాంతో వీటి ప్యానల్ బోర్డులను సురక్షిత ప్రాంతాల్లోకి తరలించే ప్రయత్నాలు చేస్తున్నారు. అంతా సవ్యంగా జరిగితే ఈసీజన్‌లో సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నీ రు ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలకు చేరనుంది. సీఎం పర్యటన నేపథ్యంలో మరమ్మతులు/పునరుద్ధరణ ప్రక్రియను వేగవంతం చేశారు. పంప్‌హౌస్‌ల పరిశీలన అనంతరం సీఎం బ్యారేజీలపై కీలక ఆదేశాలు జారీ చేయనున్నారు.



# ఈ మంచి అలవాట్లు మీ బిడ్డను స్మార్ట్‌గా చేస్తాయి

తల్లితండ్రులు తమ పిల్లలు భవిష్యత్తులో మేధావులుగా, విజయం సాధించాలని కోరుకుంటారు. మన పిల్లలు విజయం సాధించాలని మనమందరం అనుకుంటాం. ఇందుకోసం చాలా కష్టపడుతాం. కానీ మన మనస్సులో ఈ ఆలోచన ఉంటే సరిపోదు. దీనికి తగ్గట్టుగా శ్రమించాలి. అప్పుడే పిల్లల భవిష్యత్ బాగుపడుతుంది.

పిల్లలను మేధావులుగా పెంచాలి. ఏ విధమైన కార్యకలాపాలు పిల్లలను ప్రతిభావంతులుగా మారుస్తాయో తెలుసుకోవాలి. ఆ తర్వాతే వారిని ప్రోత్సహించండి. అటువంటి విషయాలను మీరు తెలుసుకోవాలి. అప్పుడే పిల్లలు జీవితంలో విజయవంతమైన వ్యక్తులుగా ఉంటారు. లేదంటే నలుగురిలో నారాయణ అన్నట్టుగా ఉండాల్సి వస్తుంది. ఎందుకంటే ఈ కాలంలో పిల్లలకు ఉండే స్కిల్స్ మీదనే భవిష్యత్ ఆధారపడి ఉంటుంది.

**సంగీతం :** సంగీతం గురించి పిల్లలకు చిన్నప్పటి నుంచే నేర్పించాలి. సంగీత పరికరాలను వాయించడం నేర్చుకోవాలి. ఇది మీ పిల్లల దృష్టిని మెరుగుపరుస్తుంది. వినూత్న ఆలోచనను కూడా ప్రోత్సహిస్తుంది. క్రియేటివిటీ పెరుగుతుంది.

**ఉదయం లేవడం :** పొద్దున్నే లేవడం కంటే మంచి అలవాటు లేదు. మీరు ఎంత ధ్యానం చేస్తున్నారో లేదా ఎంత వ్యాయామం చేస్తారో దాని కంటే ఉదయాన్నే నిద్రలేవడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఉదయాన్నే లేచేవారి మైండ్ చురుకుగా ఉంటుంది. వారు అన్ని విషయాల్లో ముందు ఉంటారు. ప్రతీ విషయాన్ని చురుకుగా వింటారు.

**ధ్యానం :** తగినంత మనశ్శాంతిని ఇవ్వడం, ధ్యానం సాధన చేయడం వల్ల రోజంతా చురుకుగా ఉండేందుకు శక్తి లభిస్తుంది. రోజూ 15 నిమిషాలు ధ్యానం చేస్తే జీవితంలో ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనే ధైర్యం ఉంటుంది. ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస. ఇలా చేస్తే పిల్లలకు ఏకాగ్రత అనేది బాగా పెరుగుతుంది. ఒక లక్ష్యంపై ఫోకస్ చేస్తారు.

**చర్చలు :** వ్యక్తులతో సహజంగా మాట్లాడటం, వారితో విషయాలు చర్చించడం వంటి కార్యక్రమాలలో పాల్గొనేలా పిల్లలను ప్రోత్సహించండి. ఇది వారి కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేస్తుంది. నలుగురిలో మాట్లాడే ధైర్యం వస్తుంది. ఏ విషయంలోనూ భయపడకుండా ఉంటారు. అన్ని విషయాలూ మీకు ధైర్యంగా చెబుతారు.

**పుస్తక పఠనం :** మీ బిడ్డను పుస్తకాలు చదివేలా చేయండి. మీరు ప్రతిరోజూ ఒక పేజీ చదివినా, మీ మెదడు శక్తి మెరుగుపడుతుంది. పుస్తకాలు చదివితే చాలా నాలెడ్జ్ వస్తుంది. ఏ సబ్జెక్ట్ పైన అయినా వారు అవగాహన కలిగి ఉంటారు.

**గార్డెనింగ్:** గార్డెనింగ్ అనేది శరీరం, మనస్సును చురుకుగా ఉంచడం చేస్తుంది. మీ పిల్లలు మొక్కలు ఎలా పెరుగుతాయో, వాటికి ఏమి అవసరమో గమనించడం ప్రారంభించాలి. కొత్త ఆలోచనలు అభివృద్ధి చెందుతాయి. ప్రకృతిపై ప్రేమ పెరుగుతుంది. ఇది మనసును ప్రశాంతంగా ఉంచేలా చేస్తుంది.

**రాయడం :** ప్రతిరోజూ ఒక పేజీలో ఏదైనా రాయమని పిల్లలను అడగండి. పిల్లలు రాసిన వాటిని ఇతరులకు చెప్పి సంతోషపెట్టండి. వారిని వ్యాసాలు రాసేలా ప్రోత్సహించండి. ఎందుకంటే ఇలా చేస్తే సృజనాత్మకత పెరుగుతుంది.

**శారీరక శ్రమ:** పుస్తకం చదవడం మాత్రమే మెదడు కార్యకలాపాలు పెంచదు. శారీరక శ్రమ కూడా అవసరం. రోజువారీ క్రీడలు, వ్యాయామంలో పిల్లలను చేర్చండి. ఇలా చేయడం వలన పిల్లలు ఆరోగ్యంగా కూడా ఉంటారు. జీవితంలో ఏదైనా సాధించేందుకు మానసికంగానూ శక్తి వస్తుంది.






సూపర్ సండే.. పంజాబ్‌పై గెలుపుతో రెండో స్థానానికి హైదరాబాద్ 'ఆరెంజ్ ఆర్మీ అంటే సునామీ కచ్చితంగా తాట తీస్తామే' అంటూ ఈ ఏడాది థీమ్ సాంగ్‌లో పాడుకున్నట్టే ప్రత్యర్థి జట్లపై రికార్డు స్కోర్లతో రెచ్చిపోతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) లీగ్ దశను మరో 'హైస్కోరింగ్ థ్రిల్లర్'తో ముగించింది.

# సూపర్ సండే..

పంజాబ్‌పై గెలుపుతో రెండో స్థానానికి హైదరాబాద్

రైజర్స్ టాప్ 2

అభిషేక్, క్లాసెన్ వీరవిహారం

ప్రభ్‌సిమ్రన్, రూసో పోరాటం వృథా

స్టేడియం హాజరు 35,967

'ఆరెంజ్ ఆర్మీ అంటే సునామీ కచ్చితంగా తాట తీస్తామే' అంటూ ఈ ఏడాది థీమ్ సాంగ్‌లో పాడుకున్నట్టే ప్రత్యర్థి జట్లపై రికార్డు స్కోర్లతో రెచ్చిపోతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) లీగ్ దశను మరో 'హైస్కోరింగ్ థ్రిల్లర్'తో ముగించింది. ఉప్పల్ స్టేడియం వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రత్యర్థి నిర్దేశించిన 215 పరుగుల టార్గెట్‌ను పెద్దగా కష్టపడకుండానే ఛే'దంచేసి' ఫ్యాన్స్‌కు 'సూపర్ సండే'ను సిక్సర్లు, ఫోర్లతో విందు భోజనంగా వడ్డించింది. అభిషేక్ శర్మ, క్లాసెన్, త్రిపాఠి వీరవిహారం చేయడంతో పంజాబ్ బ్యాటర్లు ప్రభ్‌సిమ్రన్, రూసో, అథర్వ భారీ హిట్టింగ్‌లు వృథా అయ్యాయి. ఈ విజయంతో 8వ మ్యాచ్ గెలిచిన హైదరాబాద్ 17 పాయింట్లతో పాయింట్ల పట్టికలో రెండో స్థానం దక్కించుకోగా పంజాబ్ తొమ్మిదో స్థానంతో సీజన్‌ను ముగించింది.

ఐపీఎల్ 2024లో భారీ స్కోర్లతో రెచ్చిపోతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ లీగ్ దశను ఘన విజయంతో ముగించింది. ఆదివారం ఉప్పల్ స్టేడియం వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రత్యర్థి నిర్దేశించిన 215 పరుగుల ఛేదనను మరో 5 బంతులు మిగిలుండగానే ఊదేసి 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. భారీ ఛేదనలో అభిషేక్ శర్మ (28 బంతుల్లో 66, 5 ఫోర్లు, 6 సిక్సర్లు) వీరవిహారానికి తోడు హెన్రిచ్ క్లాసెన్ (26 బంతుల్లో 42, 3 ఫోర్లు, 2 సిక్సర్లు), రాహుల్ త్రిపాఠి (18 బంతుల్లో 33, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా రెచ్చిపోవడంతో 19.1 ఓవర్లలోనే 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్.. ప్రభ్‌సిమ్రన్ (45 బంతుల్లో 71, 7 ఫోర్లు, 4 సిక్సర్లు), రిలీ రూసో (24 బంతుల్లో 49, 3 ఫోర్లు, 4 సిక్సర్లు) బాదడంతో ఆ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 214 పరుగుల భారీ స్కోరు చేసింది. ఎస్ఆర్‌హెచ్ గెలుపులో కీలకపాత్ర పోషించిన అభిషేక్ శర్మకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

ఛేదించాల్సిన లక్ష్యం తక్కువేమీ కాదు. అదీగాక ఈ సీజన్‌లో భీకరమైన ఫామ్‌లో ఉన్న ట్రావిస్ హెడ్ తొలి బంతికే డకౌట్ అవడంతో ఛేదనలో సన్‌రైజర్స్ మళ్లీ తడబడుతుందా..? అన్న అనుమానం. కానీ లేక లేక జట్టులో స్థానం దక్కించుకున్న రాహుల్ త్రిపాఠి అండతో అభిషేక్ రెచ్చిపోయాడు. మేఘావృతమైన వాతావరణం ఎప్పుడైనా ఉప్పల్‌ను ముంచేయొచ్చన్న హెచ్చరికలతో ఈ ఇద్దరూ ఆదినుంచే బ్యాట్లకు పనిచెప్పారు. అర్ష్‌దీప్ తొలి ఓవర్లోనే రెండు ఫోర్లు కొట్టిన త్రిపాఠి.. రిషి ధావన్ రెండో ఓవర్లో 6, 4, 4 సాధించాడు. అర్షదీపే వేసిన 3వ ఓవర్లో బౌండరీతో బాదుడుకు శ్రీకారం చుట్టిన అభిషేక్.. అదే ఓవర్లో 4, 6తో తన ఉద్దేశాన్ని ఘనంగా చాటాడు. ఈ ఇద్దరి వీరవిహారంతో 5 ఓవర్లు ముగియకముందే హైదరాబాద్ 70 పరుగుల మార్కును దాటేసింది. హర్షల్ వేసిన ఈ ఓవర్లో భారీ షాట్ ఆడబోయి త్రిపాఠి.. అర్ష్‌దీప్‌కు క్యాచ్ ఇచ్చాడు. కానీ నాలుగో స్థానంలో వచ్చిన నితీశ్ రెడ్డి (25 బంతుల్లో 37, 1 ఫోర్, 3 సిక్సర్లు) అభిషేక్‌కు జతకలిశాడు. హర్షల్ 8వ ఓవర్లో రెండు ఫోర్లతో 21 బంతుల్లోనే అర్ధ శతకాన్ని పూర్తిచేసిన అభిషేక్.. హర్‌ప్రీత్ 10వ ఓవర్లో 2 భారీ సిక్సర్లు కొట్టాడు. కానీ బౌలింగ్ మార్పుగా వచ్చిన శశాంక్ సింగ్.. 11వ ఓవర్లో అతడిని పెవిలియన్‌కు పంపాడు. అభిషేక్ నిష్క్రమించినా హైదరాబాద్ బెదరలేదు. 12 ఓవర్లకే 150 పరుగుల మార్కును దాటిన ఎస్ఆర్‌హెచ్‌ను నితీశ్ క్లాసెన్ విజయం వైపు నడిపించారు. ఈ ఇద్దరూ ధాటిగా ఆడుతూ పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో నితీశ్ ఔట్ అయినా, షాబాద్ (3) నిరాశపరిచినా క్లాసెన్ క్రీజులో నిలిచి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఎస్ఆర్‌హెచ్ విజయానికి 10 పరుగుల దూరంలో క్లాసెన్ ఔట్ అయినా సమద్ (11 నాటౌట్), సన్వీర్ (6 నాటౌట్) లాంఛాన్ని పూర్తిచేశారు. అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్‌కు టాప్ - 3 బ్యాటర్లు రాణించడంతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు అథర్వ (27 బంతుల్లో 46, 5 ఫోర్లు, 2 సిక్సర్లు), ప్రభ్‌సిమ్రన్.. ఓవర్‌కు 10 రన్ రేట్ తగ్గకుండా ఆడారు. తొలి వికెట్‌కు 9.1 ఓవర్లలోనే 97 పరుగుల జత చేసిన ఈ జోడీని ఎట్టకేలకు నటరాజన్ విడదీశాడు. అథర్వ నిష్క్రమించినా రూసో సాయంతో ప్రభ్‌సిమ్రన్ హైదరాబాద్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. 34 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసిన అతడు.. ఆ తర్వాత మరింత ధాటిగా ఆడాడు. వియస్కాంత్ బౌలింగ్‌లో అతడు ఔట్ కాగా, రూసోను కమిన్స్ పెవిలియన్‌కు పంపినా ఆఖర్లో పంజాబ్ తాత్కాలిక సారథి జితేశ్ శర్మ (32 నాటౌట్) 4,6,6 బాదడంతో ఆ జట్టు 210 పరుగుల మార్కును దాటింది.

రైజర్స్‌కు ఇది రెండో అత్యధిక ఛేదన. అంతకుముందు రాజస్థాన్‌పైనా 215 పరుగుల టార్గెట్‌ను విజయవంతంగా పూర్తిచేసింది.

ఈ మ్యాచ్‌లో 13 సిక్సర్లు కొట్టిన ఎస్ఆర్‌హెచ్ (160) ఇదే సీజన్‌లో ఆర్సీబీ (157) రికార్డును అధిగమించింది.

**సంక్షిప్త స్కోర్లు**

పంజాబ్: 20 ఓవర్లలో 214/5 (ప్రభ్‌సిమ్రన్ 71, రూసో 49, నటరాజన్ 2/33, కమిన్స్ 1/36).

హైదరాబాద్: 19.1 ఓవర్లలో 215/6 (అభిషేక్ 66, క్లాసెన్ 42, అర్ష్‌దీప్ 2/37, హర్షల్ 2/49).



# అల్పాహారం.. రాత్రి భోజనం ఎంత ముఖ్యమో..

బరువు తగ్గడానికి ఉత్తమ మార్గం ఆహారం స్కిప్ చేయడమని చాలా మంది పొరపాటు పడతారు. కానీ ఉదయం, అల్పాహారం తింటూనే బరువు తగ్గాలి.

సాధారణంగా బరువు తగ్గడానికి మనం సరైన ఆహారాన్ని అనుసరించాలి. అల్పాహారం, రాత్రి భోజనం దాటవేయకూడదని చాలా అధ్యయనాలు సూచిస్తున్నాయి. రాత్రి 10 గంటలకు తినడం అంటే రాత్రి భోజనం కాదు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించినా.. ఊబకాయం అతి పెద్ద ప్రమాదాలలో ఒకటి. మన శరీర బరువు సరైన స్థాయిలో లేకపోతే అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బరువు పెరగడం వల్ల మధుమేహం నుంచి గుండె జబ్బుల వరకు అనేక వ్యాధులు వస్తాయి. బరువు తగ్గడం అనేది పెద్ద టాస్క్. బరువు తగ్గేందుకు రకరకాల మార్గాలను అనుసరిస్తున్నాం. ఆహారం, వ్యాయామం, మంచి నిద్ర ద్వారా మీ బరువును సమతుల్యంగా ఉంచుకోవచ్చని వైద్యులు సలహా ఇస్తున్నారు.

డైట్ విషయానికొస్తే బరువు తగ్గడానికి ప్రయత్నించే వారు చాలా రకాల ఆహారాలను అనుసరిస్తారు. చాలా మంది కీటో డైట్, పాలియో డైట్, ఉపవాసం ఇలా ఎన్నో డైట్‌లు చేస్తున్నారు. ఇందులో అల్పాహారం తీసుకోని వారు కూడా ఉన్నారు. అదేవిధంగా, కొంతమంది రాత్రి భోజనాన్ని దాటవేస్తారు. ఏది సరైనదో చాలా మందికి తెలియదు.

**రాత్రి 10 గంటలకు తినొద్దు :** సాధారణంగా బరువు తగ్గడానికి మనం సరైన ఆహారాన్ని అనుసరించాలి. చాలా అధ్యయనాలు రాత్రిపూట కూడా అల్పాహారం తీసుకోకూడదని సూచిస్తున్నాయి. రాత్రి 10 గంటలకు తినడం అంటే రాత్రి భోజనం కాదు. సూర్యాస్తమయం తర్వాత కొన్ని గంటల తర్వాత రాత్రి భోజనం చేయాలి. బరువు తగ్గాలనుకునే వారు అల్పాహారం, రాత్రి భోజనం మానేయకూడదని అధ్యయనాలు చెబుతున్నాయి.

**అల్పాహారం తీసుకునే సమయం :** ఉదయం 8 గంటలకు అల్పాహారం తీసుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు. ఎటువంటి వ్యాయామం లేకుండా కూడా ఈ పద్ధతిని ఉపయోగించి మీరు సులభంగా బరువు తగ్గవచ్చని నిరూపించబడింది. అల్పాహారం, రాత్రి భోజనంలో కేలరీలు, పోషకాలు అవసరం. దీని ప్రకారం అల్పాహారం కోసం మీరు గుడ్లు, తృణధాన్యాలు లేదా ఇడ్లీతో దోస, పెరుగు, సాంబార్, కొబ్బరి చట్నీతో బ్రెడ్ తినవచ్చు.

**8 గంటలలోపు తినాలి :** రాత్రి 8 గంటల లోపు డిన్నర్ చేయాలని కూడా నిపుణులు చెబుతున్నారు. డిన్నర్ కోసం మీరు సూప్, ఫ్రైడ్ చికెన్ లేదా ఫిష్, సలాడ్ 1 కప్పు, పనీర్ లేదా మల్టీగ్రెయిన్ రోటీని ఆవిరి మసాలాతో ఎంచుకోవచ్చు. ఈ పద్ధతిని పాటిస్తే 1 నెలలో బరువు తగ్గుతారు. బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నప్పుడు తగినంత నీరు తాగటం చాలా ముఖ్యం. నీరు తాగడం వల్ల బరువు తగ్గడం ఎలా అని ఆలోచిస్తున్నారా? కచ్చితంగా ఇది సహాయం చేస్తుంది. నీరు తాగడం వల్ల శరీరం హైడ్రేట్‌గా ఉంటుంది. అనవసరమైన ఆకలి బాధలను తగ్గిస్తుంది.

**పండ్లు, డ్రైఫ్రూట్స్ :** పండ్లు, డ్రై ఫ్రూట్స్, ఉడికించిన కూరగాయలు, సూప్, చికెన్, గుడ్లు, మజ్జిగ వంటివి ఆహారంలో చేర్చుకుంటే బరువు తగ్గవచ్చు. పండ్లు శరీరంలో నీటిని నిలుపుకోవడంతో పాటు శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. చికెన్, పనీర్, పాల ఉత్పత్తులలో ఆరోగ్యానికి అవసరమైన ప్రోటీన్, కాల్షియం కూడా పుష్కలంగా ఉంటాయి. ఇలాంటి ఆహారాలు మిమ్మల్ని ఎక్కువ కాలం నిండుగా ఉంచుతాయి. మీరు సూప్, ఉడికించిన కూరగాయలు వంటి ఆహారాలను తిన్నప్పుడు మీరు పూర్తి శక్తితో పని చేయవచ్చు. మీరు ఈ చిట్కాలన్నింటినీ ఒక వారం పాటు అనుసరించినట్లయితే మీరు ఒక వారంలో ఉత్తమ ఫలితాలను చూడవచ్చు.






# ఛాన్స్ కొట్టేసింది.. ఆ పాత్ర రష్మిక మాత్రమే..

భాషలకు అతీతంగా ఇటు దక్షిణాదిలో అటు బాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ.. దేశవ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించుకుంటూ.. సూపర్‌స్టార్‌గా అవతరించింది రష్మిక. ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్నవన్నీ క్రేజీ ప్రాజెక్టులే. అల్లు అర్జున్ 'పుష్ప2', ధనుష్ 'కుబేర'లతోపాటు బాలీవుడ్‌లో రెండు క్రేజీ సినిమాలకు కమిట్ అయ్యింది రష్మిక. ఎంత బిజీగా ఉన్నా మంచి అవకాశం వస్తే మాత్రం డేట్స్ అడ్జస్ట్ చేసుకొనైనా ఆ సినిమా చేసేయడం రష్మిక స్టైల్. అందుకే ఆమె దగ్గరకి వచ్చిన మంచి పాత్రలు వెనక్కి వెళ్లవ్. రీసెంట్‌గా అలాంటి మరో మంచి అవకాశమే నేషనల్ క్రష్‌ని పలకరించింది. తమిళ స్టార్ హీరో శివకార్తికేయన్ కథానాయకుడిగా శిబిచక్రవర్తి దర్శకత్వంలో రూపొందనున్న సినిమాలో ఛాన్స్ కొట్టేసింది రష్మిక. ఇది రష్మిక మాత్రమే చేయగలిగిన పాత్ర అని, అందుకే ఆమెను కలిశామని దర్శకుడు శిబిచక్రవర్తి చెబుతున్నారు. హిట్ సినిమాల్లో నటించడం, గొప్ప పాత్రలతో మెప్పించడం అందరికీ సాధ్యంకాదు. అందుకే రష్మిక లక్కీ.



# అగ్గంటుకుంది సంద్రం.. ఆ గుండె మండే ఆకసం..



ఎన్టీఆర్ 'దేవర' సినిమాలోని ఫస్ట్ సాంగ్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. ఇందులోని ఎన్టీయార్ కేరక్టరైజేషనే ఈ పాట. తారక్ మాస్ ఇమేజ్‌ని దృష్టిలో పెట్టుకొని అద్భుతంగా ఈ పాటను మలిచారు దర్శకుడు కొరటాల శివ. మాస్ ప్రేక్షకులకు విందుభోజనం లాంటి సినిమాగా 'దేవర' తెరకెక్కుతున్నదని ఈ పాట చూస్తే అర్థమవుతుంది. 'అగ్గంటుకుంది సంద్రం.. ఆ గుండె మండే ఆకసం.. అరాచకాలు భగ్నం.. చల్లారే చెడు సాహసం..' అంటూ సాగే ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాయగా, అనిరుథ్ రవిచంద్రన్ స్వరపరిచి, ఆలపించారు. ఇందులోని హీరో గుణగణాలను, వీరత్వాన్ని తన సాహిత్యంతో అద్భుతంగా ఆవిష్కరించారు గీత రచయిత రామజోగయ్యశాస్త్రి. ఇక అనిరుథ్ సంగీతం మాస్‌ని ఉర్రూతలూగించేలా ఉంది. వెన్నెల్లో అందంగా కనిపించే సముద్రాన్ని రక్తసిక్తంగా చూపిస్తూ, తెగిపడిన శరీర భాగాలతో, దారుణమైన మారణాయుధాలతో ఆద్యంతం పోరాటాలతోనే ఈ పాట సాగింది. ఎన్టీయార్ మాస్ అవతార్ అభిమానులు పండుగ చేసుకునేలా ఉంది. రెండు పార్టులుగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్‌రామ్, కొసరాజు హరికృష్ణ, సుధాకర్ మిక్కిలినేని కలిసి నిర్మిస్తున్నారు. అక్టోబర్ 10న సినిమా విడుదల కానుంది.



# గెటప్ శ్రీను ప్రతిభకు హద్దులు లేవు

'ఈ తరం కామెడీ నటుల్లో నాకు ఇష్టమైన నటుడు గెటప్ శ్రీను. ఇప్పుడే తను హీరోగా నటించిన 'రాజు యాదవ్' ట్రైలర్ చూశాను. కొత్తదనం కనిపించింది. ఇందులో శ్రీను నవ్విస్తాడు, కవ్విస్తాడు, చక్కని వినోదాన్ని పంచుతాడు.' అని పద్మవిభూషణ్ చిరంజీవి అన్నారు. గెటప్ శ్రీను హీరోగా నటించిన 'రాజు యాదవ్' సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా గెటప్ శ్రీను ఆదివారం చిరంజీవిని కలిసి ఆశీస్సులు అందుకున్నారు. చిరంజీవి ఇంకా మాట్లాడుతూ 'గెటప్ శీనుని చూస్తుంటే నాకు అప్పటి కామెడీ హీరో చలం గుర్తుకొస్తారు. గెటప్‌శ్రీను ప్రతిభకు హద్దులు లేవు అనిపిస్తుంది. కచ్చితంగా ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను' అని శుభాంకాంక్షలందించారు. కృష్ణమాచారి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి కె.ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి నిర్మించిన విషయం విదితమే.

# కంగనా రనౌత్ ఏం చెప్పారో తెలుసా..?

బాలీవుడ్‌కు చెందిన ప్రముఖ నటి కంగనా రనౌత్ తాజాగా ఓ జాతీయ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధి.. 'ఈ ఎన్నికల్లో ఎంపీగా గెలిస్తే మీరు సినిమాలకు దూరంగా ఉంటారా..?' అని ప్రశ్నించారు. అందుకు అవుననే సమాధానం ఇచ్చారు. ఎంపీగా గెలిస్తే సినిమాలకు దూరంగా ఉంటానని స్పష్టం చేశారు. 'బాలీవుడ్‌లో నేను విజయం సాధించా. నటిగా ఎన్నో అవార్డులు గెలుచుకున్నా. మండి ఎంపీగా గెలుపొందితే బాలీవుడ్‌కు వీడ్కోలు పలకాలనుకుంటున్నా. ఒక ఉత్తమ ఎంపీగా ప్రజలకు నావంతు సేవ చేసేందుకు కృషిచేస్తా. అదే నాకు గొప్ప అవార్డుగా భావిస్తా' అని కంగనా చెప్పారు. అయితే ఎంపీగా గెలిచినా సినీ ఇండస్ట్రీలో కొనసాగాలని నిర్మాతల నుంచి తనకు విజ్ఞప్తులు వస్తున్నాయని ఆమె తెలిపారు. 'మీరొక ప్రతిభావంతమైన నటి. సినిమాలకు దూరంగా ఉండొద్దు' అని చాలా మంది నిర్మాతలు, ప్రముఖ నటులు కోరుతున్నట్లు కంగనా రనౌత్ చెప్పారు. అంతకుముందు మరో వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కంగనా భిన్నంగా స్పందించారు. ఏమన్నారంటే.. 'ఎన్నికల ముందు నేను సంతకం చేసిన కొన్ని సినిమాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కారణంతో వెంటనే బాలీవుడ్‌ను విడిచి పెట్టలేను' అని చెప్పారు. కంగనా రనౌత్ ఈ లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీపడ్డారు. ఎన్నికల కారణంగా ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'ఎమర్జెన్సీ' వాయిదా పడింది. ఎన్నికల వేళ కంగనా బిజీగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్రబృందం ఇటీవల ప్రకటించింది. ఈ సినిమా కంగనా స్వీయ దర్శకత్వంలో రూపొందుతోంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com